బస్టాండ్‌లో దాహం కేకలు

- సమస్యల వలయంలో బస్టాండ్
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు


మక్తల్ ఆర్టీసీ బస్టాండ్

మక్తల్: నియోజకవర్గ కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సమస్యలకు నిలయంగా మారింది. బస్టాండ్‌లో కనీసం తాగునీటి వసతి కూడా లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాహం వేస్తే వాటర్ బాటిల్ కొనాల్సిందేనని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. మక్తల్‌లోని బస్టాండ్‌కు చుట్టుపక్కల గ్రామాల నుంచి అనేక మంది ప్రయాణికులు వస్తూపోతుంటారు. బస్సులు తప్పిపోతే రాత్రి సమయంలో బస చేయడానికి చిన్న చిన్న సౌకర్యాలు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రాంగణంలో ఒకే ఒక ఫ్యాన్ ఉంది. మిగతా వాటిని మరమ్మతు కోసం తీసుకెళ్లి అనేక రోజులు గడుస్తున్నా అధికారులు స్పందించడం లేదు. అలాగే తాగునీటి కోసం వాటర్ ట్యాంకు ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది. బస్టాండ్‌లో అద్దె కిరాయి రూ.వేలల్లో ఉన్న తాగునీటి వసతి మాత్రం కల్పించడం లేదని పేర్కొంటున్నారు.

ప్రయాణికుల తీవ్ర అసహనం

హైదరాబాద్ నుంచి రాయచూర్‌కు, రాయచూర్ నుంచి హైదరాబాద్‌కు ప్రతి రోజు పదుల సంఖ్యలో బస్సులు వెళ్తుంటాయి. వందల సంఖ్యలో ప్రయాణికులు ఈ బస్టాండ్ ద్వారా ప్రయాణాలు సాగిస్తున్నా అధికారులు కనీస వసతులు కల్పించకపోవడంపై మహిళలు, వృద్ధులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు సైతం ఇళ్ల నుంచి వాటర్ బాటిల్స్ తీసుకొచ్చి భోజనం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్‌లో తాగునీటి వసతితో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



మక్తల్ బస్టాండ్‌లో తాగునీటి కొరతతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్టాండ్‌లో షాపుల అద్దె ద్వారా ఆదాయం వస్తున్న అధికారులు నీటి వసతి కల్పించకపోవడం ఆశ్చర్యంగా ఉంది. ప్రయాణికులందరూ బయట వాటర్ బాటిల్స్ కొనుక్కోని తాగలేరు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.
–నీలప్ప, మక్తల్

కండక్టర్, డ్రైవర్లకు తప్పని తిప్పలు



బస్టాండ్‌లో నీటి వసతి లేకపోవడంతో డ్రైవర్లు, కండక్టర్లు కూడా ఇళ్ల నుంచి వాటర్ బాటిల్స్ తెచ్చుకొని భోజనం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఏళ్ల నుంచి ఈ సమస్య ఉన్నా అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి తాగునీటిని అందుబాటులో ఉంచాలి.
–నాగేష్, పస్పుల, మక్తల్ మండలం

చర్యలు తీసుకుంటాం

మక్తల్ బస్టాండ్‌లో తాగునీటి కోసం పైపులైన్ కనెక్షన్ ఏర్పాటు చేసేలా మున్సిపల్ అధికారులకు సూచించాం. అదే విధంగా సమస్యను మంత్రి వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదల చేయించేలా చర్యలు తీసుకుంటాం. అలాగే బస్టాండ్ ప్రాంగణంలో ఫ్యాన్ల ఏర్పాటుతో పాటు తాగునీటి సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో సమస్యను పరిష్కరించి ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చూస్తాం.
–లావణ్య, డీఎం, నారాయణపేట

గ్రామాల పరిశుభ్రతకే 'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్'


స్వచ్ఛ సర్వేక్షణ్ సభ్యులతో ఎంపీడీఓ శ్రీనివాసులు

మాగనూర్: గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలనే లక్ష్యంతోనే కేంద్ర ప్రభుత్వం 'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2025' నిర్వహిస్తోందని ఎంపీడీవో శ్రీనివాసులు అన్నారు. మంగళవారం టీం సభ్యులతో కలిసి మండలంలోని కోల్పూర్ గ్రామాన్ని ఆయన సందర్శించారు. గ్రామంలో ఇంటింటికీ తిరిగి చెత్త సేకరణ వాహనం ఇంటి వద్దకు వస్తుందా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా పల్లెలో మురుగుదొడ్ల వినియోగంపై ఆరా తీశారు. ప్రజలు ప్రతి ఒక్కరూ కూడా మరుగుదొడ్లు వినియోగించుకోవాలని సూచించారు. బహిరంగ మల, మూత్ర విసర్జనను బహిష్కరించి స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక పాఠశాలలో పలు అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వచ్ఛ సర్వేక్షణ్ కోఆర్డినేటర్ నవనీత, మానిక్ , ప్రధానోపాధ్యాయులు తిమ్మన్న, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

జింకల నుంచి పంటలను కాపాడండి


పంట పొలంలో జింకల గుంపు

మాగనూర్: మండలంలోని రైతులు జింకలతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. వేలాది రూపాయలు ఖర్చులు చేసి పంటలు సాగు చేస్తుంటే జింకలు మాత్రం రాత్రి, పగలు అనే తేడా లేకుండా పంటను ధ్వంసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటి కాదు రెండు కాదు ఏకంగా పదుల సంఖ్యలో వచ్చి పంటను నాశనం చేస్తున్నాయని ఎన్ని ప్రయత్నాలు చేసిన పంటలను మాత్రం రక్షించుకోలేకపోతున్నామంటున్నారు. ఈ ప్రాంతంలో జింకలు ఎక్కువగా ఉండటంతో జింకల పార్కు ఏర్పాటు చేస్తామని ఏళ్ల నుంచి అధికారులు చెబుతున్నా ఆచరణలో ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జింకల నుంచి పంటను కాపాడాలని కోరుతున్నారు.

సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్ అమలు చేయాలి


ధర్నా చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నారాయణపేట రూరల్: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారమే ధ్యేయంగా యూఎస్‌పీసీ పనిచేస్తుందని నాయకులు అన్నారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద మున్సిపల్ పార్కు దగ్గర మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 317 జీఓతో స్థానికత కోల్పోయిన టీచర్లకు సొంత జిల్లాకు పంపాలని, సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్‌సీని ప్రకటించాలని, రిటైర్డ్ ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను క్లియర్ చేయాలన్నారు. పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించాలని అవసరం ఉన్న పీఎస్ హెడ్మాస్టర్ పోస్టులను మంజూరు చేయాలన్నారు. ఆగస్టు 23న హైదరాబాద్‌లో జరిగే ధర్నాకు తరలిరావాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏవో జయసుధకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో శివరాములు, బాలాజీ, దేవేందర్, రెడ్డప్ప, సూర్యచంద్ర, హైమావతి, మల్లయ్య, సాయప్ప, శ్రీనివాస్, కృష్ణ గౌడ్, వెంకట్ నాయక్, భీమయ్య, వెంకటేష్, గజలప్ప, వెంకటప్ప, అబ్దుల్ ఖాదర్, రామకృష్ణ, పరంధాములు, జ్యోతి, పాల్గొన్నారు.

ఆస్పత్రులపై చర్యలు తీసుకోండి


వినతిపత్రం అందిస్తున్న పీఓడబ్ల్యూ సభ్యులు

నారాయణపేట టౌన్/నారాయణపేట రూరల్: నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆస్పత్రులపై చర్యలు తీసుకోవాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి జయ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా డిప్యూటీ వైద్య ఆరోగ్య అధికారిణి శైలజను కలిసి వినతిపత్రం అందజేశారు. సరోగసి–2021 చట్టం ప్రకారం నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఆసుపత్రులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. చట్టానికి వ్యతిరేకంగా శిశువు విక్రయాలకు పాల్పడుతున్న హైదరాబాద్ కేంద్రంలో ఉన్న సృష్టి ఫర్టిలిటీ ఆసుపత్రిలో డాక్టర్‌గా పని చేస్తున్న నమ్రత కేసులో రోజురోజుకు కొత్త విషయాలు వెలుగు చూస్తున్నాయన్నారు. అందుకే జిల్లాలో సరోగసి నిర్వహిస్తున్న ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. కార్యక్రమంలో పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు శారద, కోశాధికారి మహాదేవి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్‌పై సస్పెండ్ ఎత్తివేయాలి

ధన్వాడ: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఉమై ఆస్రా, పీటీ తులసీదాస్‌పై సస్పెన్షన్ ఎత్తివేసి వారిని విధుల్లోకి తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్, పీవైఎల్ జిల్లా నాయకుడు కృష్ణ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కేంద్రంలోని డీఈఓ గోవిందరాజు, కలెక్టరేట్ ఏవో జయసుధకు వినతిపత్రం అందజేశారు. కేజీబీవీకి చెందిన సమస్యలో కేజీబీవీ ఎస్ఓపై చర్యలు తీసుకోకుండా మోడల్ స్కూల్ సిబ్బందిని సస్పెండ్ చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్, సహాయ కార్యదర్శి వెంకటేశ్, కోశాధికారి మహేష్, నాయకులు సురేష్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో యూరియా

ధన్వాడ: ధన్వాడ మండలంలో తగినంత యూరియా అందుబాటులో ఉందని ఎలాంటి యూరియా కొరత లేదని మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను అలాగే గోదాంలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సరిపడా యూరియా ఉందని రైతులు ఎలాంటి ఆందోళన చెందొద్దని సూచించారు. రైతులు కూడా అవసరం మేరకే తీసుకోవాలని, అలాగే ఎరువులు తీసుకునేటప్పుడు తప్పనిసరిగా ఆధార్ కార్డు సమర్పించాలన్నారు. ఎవరైనా డీలర్లు ఎమ్మార్పీ కన్నా ఎక్కువ రేటుకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కెమిస్ట్, డ్రగ్గిస్ట్ నూతన అసోసియేషన్ ఎన్నిక

నారాయణపేట రూరల్: జిల్లా కెమిస్ట్, డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక సాయి హనుమాన్ దేవాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా నూతన అధ్యక్షుడిగా గందె ఉమాకాంత్, కార్యదర్శిగా కొండవిజయకుమార్, కోశాధికారిగా దయానంద్‌ను ఎంపిక చేశారు. ఆన్లైన్ ఫార్మసి పెరుగుదల, జనరిక్ మెడికల్ షాపుల ప్రభావం, ప్రభుత్వ నియంత్రణ, జీఎస్టీ ఫైలింగ్ సమస్యల పరిష్కారానికి తమ వంతుగా కృషి చేస్తామని నూతన సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ప్రభాకర్, రఘుపతి, జనార్దన్, లక్ష్మన్, శశిదర్, శంకర్, శశికాంత్, మదన్ రెడ్డి, ఉమాకాంత్, వెంకటేష్ పాల్గొన్నారు.

పాముకాటుతో కాడెద్దు మృతి



దామరగిద్ద: పాముకాటుతో కాడెద్దు మృతి చెందిన ఘటన మంగళవారం లోకూర్తి గ్రామంలో చోటుచేసుకుంది. ప్రశాంత్ ఆదివారం సాయంత్రం కాడెద్దును పశువుల పాకలో కట్టేసి ఇంటికి వెళ్లాడు. ఉదయం వచ్చి చూడగా నోటిలో రక్తపు నురగలు, కడుపు ఉబ్బి మృతజీవిగా పడి ఉండటంతో చూసి కన్నీరు మున్నీరు అయ్యాడు. పాము కాటుతో మృతి చెంది ఉంటుందని అనుమానం వ్యక్తం చేశాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



నర్వ: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 2000–01లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఔదార్యాన్ని చాటుకున్నారు. పాఠశాలలో వాటర్‌ప్లాంట్, హ్యాండ్‌వాష్ పాయింట్స్‌కు రూ.35 వేల ఖర్చుతో టైల్స్, నల్లాలు ఏర్పాటు చేయించారు. అనంతరం ప్లాంట్‌ను తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓ రాంరెడ్డి చేతుల మీదుగా ప్రారంభింపజేశారు. గతంలో ఈ ప్లాంటు మరమ్మతుకు గురికావడంతో పూర్వ విద్యార్థులే రూ.లక్షతో మిషన్‌ను అందించినట్లు ఉపాధ్యాయులు తెలిపారు.

డే కేర్ సెంటర్ ఏర్పాటుపై కలెక్టర్ సమీక్ష


సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

నారాయణపేట: రాష్ట్ర ప్రభుత్వం జిల్లా కేంద్రాలలో నూతనంగా ప్రవేశపెడుతున్న వయోవృద్ధుల డే కేర్ సెంటర్ ఏర్పాటుకు జిల్లా కేంద్రంలో అనువైన భవనాన్ని గుర్తించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. నూతన డే కేర్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు కోరగా కేవలం ఒక దరఖాస్తు మాత్రమే రావడంతో మంగళవారం సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులతో కలెక్టర్ తన ఛాంబర్‌లో డే కేర్ సెంటర్ ఏర్పాటు అంశంపై చర్చించారు. వారం రోజులలో డే కేర్ సెంటర్ కోసం ఏదైన ప్రభుత్వ భవనాన్ని చూడాలని కమిటీ సభ్యులకు సూచించారు. సమీక్షలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు సుదర్శన్ రెడ్డి, ఎఫ్.ఆర్.ఓ సాయి పాల్గొన్నారు.

కాంస్య పతకం సాధించిన పోలీసు జాగిలం


జాగిలం రుద్ర, డాగ్ హ్యాండ్లర్ రవిని సన్మానిస్తున్న ఎస్పీ యోగేష్ గౌతమ్

నారాయణ పేట క్రైమ్: వరంగల్ జిల్లా మమునూరు పీటీసీలో జరిగిన రాష్ట్ర రెండో పోలీస్ డ్యూటీ మీట్‌లో జోగులాంబ జోన్ నుంచి ట్రాకింగ్ విభాగంలో మర్డర్ కేసులను, దొంగతనాలను గుర్తించడంలో పోలీసు జాగిలం రుద్ర, డాగ్ హ్యాండ్లర్ ఏఆర్ కానిస్టేబుల్ రవి కాంస్య పతకం సాధించారు. ఈ క్రమంలో మంగళవారం ఎస్పీ యోగేష్ గౌతమ్ తన కార్యాలయంలో పోలీసు జాగిలం రుద్ర, డాగ్ హ్యాండ్లర్ రవికి కాంస్య పతకం ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. 2026 ఫిబ్రవరిలో పూణేలో జరిగే నేషనల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో పాల్గొని బంగారు పతకం సాధించి రాష్ట్రానికి, జిల్లాకు పేరును తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండీ.రియాజ్ హూల్ హక్, పీసీ నరేందర్ పాల్గొన్నారు.

బలవంతపు భూసేకరణ ఆపాలి


మాట్లాడుతున్న గోపాల్

నారాయణపేట: నారాయణపేట–కొడంగల్ ప్రాజెక్ట్ కింద భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులు జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు దగ్గర చేపట్టిన రిలే దీక్షలు మంగళవారం 22వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా భూ నిర్వాసితుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్రామారెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్ మాట్లాడుతూ ప్రభుత్వం చెప్పుకుంటున్నా ప్రజాపాలన అంటే రైతులను పట్టించుకోక పోవడమేనా అని ప్రశ్నించారు. రైతులను భయపెట్టి ఎకరాకు రూ.14లక్షలు ఇచ్చి చేతులు దులుపుకునే ప్రయత్నం ఆపాలన్నారు. వెంటనే ప్రభుత్వం బలవంతపు భూసేకరణ ఆపి రైతులతో చర్చించి సరైన పరిహారం ఇచ్చి భూములు సేకరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షులు మశ్చందర్. దీక్షలో రైతులు ఆంజనేయులు, భీమప్ప,అంజప్ప,ఆనంద్ కూర్చున్నారు.

సీసీ రోడ్డు, మురుగు కాల్వ నిర్మించండి


ఎంపీడీఓకు తీర్మాన పత్రం అందిస్తున్న గుడెబల్లూర్ గ్రామస్తులు

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ గ్రామ తిమ్మప్ప గుడి చెరువు కింద మురుగు, వర్షపునీరు వెళ్లేలా నాలా నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై పలుమార్లు అధికారులకు విన్నవించగా మంగళవారం ఎంపీడీఓ విజయలక్ష్మి ఇరిగేషన్ అధికారులతో కలిసి వీధులను, మురుగు నీరును పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు తిమ్మప్ప చెరువు నుంచి మొదలుకొని ఊరచెరువు వరకు నాలా నిర్మించాలని, అలాగే కమ్యూనిటీ హాల్ వరకు సీసీ రోడ్డును నిర్మించాలని పంచాయతి కార్యదర్శితో తీర్మానం చేయించి ఎంపీడీఓకు ఆ తీర్మాన పత్రాన్ని అందించారు. అనంతరం ఎంపీడీఓ మాట్లాడుతూ నాలా, సీసీ రోడ్డును నిర్మించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గ్రామ నాయకులు కృష్ణామూర్తి,వెంకటేష్, రాము, తిమ్మురాజ్ తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' వర్తింపజేయాలి

ఊట్కూరు: వ్యవసాయ కూలీలందరికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేసి రూ.21 వేలు సాయం అందించాలని ఏఐకేఎంఎస్ మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింప జేయాలని కోరారు. అధికారం చేపట్టి 18 నెలలు అయినప్పటికీ వ్యవసాయ కూలీలకు పథకాన్ని వర్తింప చేయలేదన్నారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కనకారాయుడు, గోవర్ధన్, నర్సింహ, వెంకటేశ్, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురుగు పరుగు



మరికల్: మండలంలోని పెద్దచింతకుంటలో సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు ఇళ్లలోకి వస్తుంది. రోడ్లకు ఇరువైపులా డ్రెయినేజీ కాలువలు లేకపోవడంతో మురుగు ముందుకు వెళ్లలేక రోడ్లపై పారుతుండటమే కాకుండా ఎక్కడ గుంతలు ఉంటే అక్కడ కలుషిత నీరు నిలవడం వల్ల ప్రజలు అంటువ్యాధుల బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదంటూ గ్రామస్తులు పేర్కొంటున్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న గ్రామస్తులు



కృష్ణా: మండలంలోని ఖాన్‌దొడ్డి గ్రామ శివారులో గల ప్రభుత్వ భూమి నుంచి మొరంను అక్రమార్కులు ఇతర ప్రాంతాలను తరలిస్తుండగా మంగళవారం గ్రామస్తులు అడ్డుకున్నారు. అక్రమార్కులు కొంత కాలంగా మొరంను టిప్పర్ల ద్వారా ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ విషయంపై పలుమార్లు తహసీల్దార్ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టిప్పర్లు వెళ్తుండడంతో తమ గ్రామ బీటీ రోడ్డు పూర్తిగా దెబ్బతిందని, మట్టిని తరలిస్తున్న అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్,పుత్ర వెంకటేష్,వణుకు రమేష్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

నారాయణపేట రూరల్: మండలంలోని కొటకొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వీపర్ గా పనిచేస్తున్న చిట్టెమ్మ భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అక్కడి వైద్యులు డాక్టర్ ప్రతిభా భారతి, డాక్టర్ చందనతో పాటు తోటి సిబ్బంది కలిసి ఆమెకు రూ.15వేలు ఆర్థిక సాయం చేశారు. చిట్టెమ్మకు అన్ని విధాల ఆదుకుంటామని భరోసా అందించారు. కార్యక్రమంలో డాక్టర్ విరోజ, సూపర్‌వైజర్లు ఫార్మసిస్ట్, ల్యాబ్ టెక్నీషియన్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అడుగుకో గుంత.. వెళ్లాలంటే చింత



మండలంలోని వర్కూర్, నెరడగం గ్రామాలకు వెళ్లే బీటీరోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు పాడై సంవత్సరాలు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ రోడ్డుపై ప్రజలు ప్రయాణం చేయాలంటేనే జంకుతున్నారు. కేవలం 8 కిలోమీటర్ల దూరమే ఉన్నప్పటికీ అష్టకష్టాలు పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన బీటీ రోడ్డు వేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – మాగనూర్

క్లుప్తంగా

భవిత కేంద్రాన్ని సద్వినియోగించుకోవాలి



కృష్ణా: భవిత కేంద్రాన్ని దివ్యాంగ, మానసిక విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ నిజాముద్దీన్ సూచించారు. మండలంలోని ముడుమాల్ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన భవిత కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. మానసిక వికలాంగులు, చెవుడు, మూగ విద్యార్థుల ఉపయోగార్థం భవిత కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, మానసిక విద్యార్థుల తల్లిదండ్రులు ఈ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖర్, కాంప్లెక్స్ హెచ్ఎం గణేష్‌సింగ్, ఉపాధ్యాయులు జనార్ధన్,జ్యోతి పాల్గొన్నారు.

తల్లిపాలతోనే బిడ్డకు ఆరోగ్యం



మరికల్: పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టిస్తే ఆరోగ్యంగా ఉంటుందని మక్తల్ అడిషనల్ సీడీపీఓ గిరిజ అన్నారు. మరికల్‌లోని అంగన్‌వాడి కేంద్రాల్లో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనుగుణంగా పిల్లలకు తల్లులు పాలు పట్టించకుండా పశువుల, డబ్బా పాలు తాగించడం వల్ల పిల్లలకు అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు పట్టిస్తే ఎంతో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ మహేశ్వరి, అంగన్‌వాడి కార్యకర్తలు చంద్రకళ, బాలమ్మ, భారతమ్మ, సుమిత్ర, లక్ష్మిదేవి, హైమావతి, అరుణ, పుష్ప, శైలజ ఆయాలు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి



మరికల్: కొయిల్‌సాగర్ వాగు సమీపంలో ఉన్న పల్లమర్రికి చెందిన కొందరు ఇసుక వ్యాపారులు ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా గుట్టుచప్పుడుగా మహబూబ్‌నగర్, మరికల్, నర్వ తదితర గ్రామాలకు ఇసుకను తరలిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. టిప్పర్‌కు రూ.36 వేలు, ట్రాక్టర్ ఇసుక రూ.6 వేల చొప్పున విక్రయిస్తూ రూ.లక్షలు సంపాదిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరుతున్నారు.

గురుకులాల్లో విషసర్పాల బెడద

మరికల్: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో విషసర్పాల బెడద అధికంగా ఉందని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం పాఠశాల ఆవరణలోకి రెండు పాములు రావడంతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. అధికారులు స్పందించి పాఠశాల చుట్టూ పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ప్రిన్సిపల్ నాగమణిమాల కోరారు.

గొర్రెల కాపరులను ఆదుకోండి

ధన్వాడ: మండలంలోని హన్మన్‌పల్లి గ్రామానికి చెందిన కురువ పార్ల లింగప్పకు చెందిన 126 గొర్రెలు, చిన్న కురుమప్పకు చెందిన 26 గొర్రెలు, దొరేమోనప్పకు చెందిన నాలుగు గొర్రెలు సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో మేతకు వెళ్లాయి. అక్కడ మేత మేసిన గొర్రెలు నుంకు వ్యాధి సోకి చనిపోయాయి. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు లక్ష్మారెడ్డి, కురువ రవి, శ్రీనివాసులు బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.

ఎమ్మార్పీఎస్ కమిటీ ఎన్నిక

ఊట్కూరు: మండలంలోని బాపూర్ గ్రామంలో మంగళవారం ఎమ్మార్పీఎస్ గ్రామ కమిటీని జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ల హనుమంతు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా అనంతయ్య మాదిగ, ఉపాధ్యక్షుడిగా వడ్ల వెంకటేష్, ప్రధాన కార్యదర్శిగా నర్సింహులు, కోశాధికారిగా ఎల్. నర్సింహులును అలాగే సభ్యులుగా కిష్టప్ప, కాలప్ప, వెంకటప్ప, హనుమంతును ఎన్నుకున్నారు.